



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక






| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 115 | సోమవారం | 19-01- 2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 115 | Monday | 19-01- 2026 | Price: ₹3/- | Pages: 8 |




# వీలైనంత త్వరలో మున్సిపల్ ఎన్నికలు

**వీలైనంత త్వరలో మున్సిపల్ ఎన్నికలు**

**116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎలక్షన్స్**

**డెడికేషన్ కమిషన్ ఆధారంగా ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు**

**2027 జులై 27 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాలు**

**బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి టెంపుల్ సర్క్యూట్**

**జంపన్న వాగులో నిరంతరం నీరు ఉండేలా రామప్ప, లక్నవరం నుంచి గోదావరి ఎత్తిపోతలు**

**ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్**

**మెట్రో ఫేజ్ - 2 భూసేకరణకు రూ. 2,787 కోట్ల కేటాయింపు**

**మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో లా కాలేజీ ఏర్పాటు**

**కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి, సీతక్క**




**హైదరాబాద్, జనవరి18 (క్విక్ టుడే న్యూస్):**
పదవీకాలం పూర్తయిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు వీలైనంత తొందరగా ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం నిర్ణయించింది. మేడారంలో ఆదివారం నిర్వహించిన కేబినెట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క మీడియాకు వివరించారు. రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, వాటి పరిధిలోని 2,996 వార్డులు, డివిజన్లకు సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ సమావేశం తీర్మానించింది. చరిత్రలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ వెలుపల మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన మేడారంలో జరిగిన ఈ మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి డెడికేషన్ కమిషన్ ఇప్పటికే నివేదిక సమర్పించడం, రిజర్వేషన్లు కూడా ఖరారవడం, అలాగే ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండుగలతో పాటు చివరి వారం నుంచి వివిధ స్థాయిల్లో విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, సాధ్యమైనంత తొందరగా ఎన్నికలు పూర్తి చేయాలని మంత్రిమండలి భావించింది. మేడారం జంపన్న వాగులో నిరంతరం నీరు ఉండే విధంగా రామప్ప, లక్నవరం నుంచి గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు సంబంధించి రూ. 143 కోట్లు మంజూరు చేసింది. ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కేబినెట్ ఆమోదించింది. రామప్ప చెర్వు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతో పాటు.. 7500 ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించనుంది. మేడారం పుణ్యక్షేత్రం కోసం ఇప్పటికే 19 ఎకరాల భూ సేకరణ పూర్తి కాగా, మరో 20 లేదా 21 ఎకరాల భూమిని

మిగతా 2లో

## కుంభమేళా తరహాలో మేడారం మహాజాతర

**వీరవనితలు సమ్మక్క, సారలమ్మల పుణ్యక్షేత్రం మేడారం**

**ఇకపై జంపన్న వాగులో నిరంతరం నీటి ప్రవాహం**

**రామప్ప - లక్నవరం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలిస్తాం**

**ఇచ్చిన మాట ప్రకారం సమ్మక్క, సారలమ్మ ఆలయాన్ని పునరుద్ధరించాం**

**మేడారంలో సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, జనవరి18 (క్విక్ టుడే న్యూస్):**
ఆదివాసీ వీరవనితలు సమ్మక్క, సారలమ్మలు కొలువైన మేడారం పుణ్యక్షేత్రం.. జంపన్న వాగులో నిరంతరం నీరు ప్రవహించే విధంగా రామప్ప – లక్నవరం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అలాగే ఈ పుణ్యక్షేత్రాన్ని తిరుమల – తిరుపతి, కుంభమేళాలను తలపించేలా ప్రతినిత్యం భక్తులు సందర్శించే విధంగా మేడారం ఆలయ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. సమ్మక్క – సారలమ్మ మహాజాతర సందర్భంగా మేడారంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. మేడారంలో జరిగిన మంత్రిమండలి సమావేశం అనంతరం నిర్వహించిన ఈ ఉత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ సమ్మక్క – సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంతరం భక్తులు, పర్యాటకులు సందర్శించే విధంగా మేడారం ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. “ధీరత్వమే దైవత్వంగా మారిన చారిత్రక సత్యం మేడారం మహోత్సవం. గుడి లేని తల్లులను గుండెనిండా నింపుకుని జరుపుకునే అతిపెద్ద మేడారం జాతర కోసం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిగా సంతృప్తినిచ్చాయి. 2023 ఫిబ్రవరి 6వ తేదీన ఈ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా

మిగతా 2లో

## అయోధ్య మాదిరిగా భద్రాద్రి

**ఖమ్మం జిల్లా ఏదులాపురంలో రూ.362 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత**

**నర్సింగ్ కళాశాల విద్యార్థులకు జర్మనీ, జపనీస్ భాషల్లో శిక్షణ**

**ఇంజనీరింగ్ కంటే నర్సింగ్ విద్యార్థులకు అత్యధిక డిమాండ్**

**మద్దులపల్లి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




ఖమ్మం, జనవరి18 (క్విక్ టుడే న్యూస్):
ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో దాదాపు రూ.362 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్నేరు నుంచి పాలేరు లింక్ కెనాల్, ఏదులాపురంలోని జేఎన్‌టీయూ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కూసుమంచిలో వంద పడకల ఆసుపత్రి, మద్దులపల్లిలో నూతన మార్కెట్ యార్డు, నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఏదులాపురం

మిగతా 2లో



## నేడు దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి

**వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లనున్న సీఎం**

**హైదరాబాద్, జనవరి18 (క్విక్ టుడే న్యూస్):**
ప్రపంచ ఆర్థిక ఫోరం(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి

మిగతా 2లో

## విరాట్ విరోచిత పోరాటం వృథా

**1-2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్**

**మూడో వన్డేలో టీమిండియాపై న్యూజిలాండ్ విజయం**

**డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ సెంచరీలతో చెలరేగిన కివీస్**





**ఇండోర్, జనవరి18:**
భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇండోర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో కివీస్ విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1 తేడాతో చేజిక్కించుకుంది. విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో పోరాడినా జట్టును

మిగతా 2లో

## ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపు

**-అమెరికా- యూరప్ వాణిజ్య ఒప్పందానికి బ్రేక్**



**న్యూయార్క్, జనవరి18:**
గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న పంతంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. గ్రీన్‌లాండ్ విషయంలో

మిగతా 2లో

## ఇరాన్ లో ఘర్షణ

**కాల్పుల్లో 16,500 మంది మృతి..**

**రక్త దాతలు లేక మరణాలు**




**న్యూఢిల్లీ, జనవరి18:**
అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న ఇరాన్ లో పౌరుల ప్రాణాలు వేల సంఖ్యలో గాలిలో కలిసిపోతున్నాయి. గత మూడు వారాలుగా

మిగతా 2లో

తరువాయి పేజీ..

# వీలైనంత త్వరలో మున్సిపల్ ఎన్నికలు



## అయోధ్య మాదిరిగా భద్రాద్రి

నర్సింగ్ కాలేజీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. వివిధ దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి నర్సింగ్ విద్యార్థులకు జపనీస్, జర్మన్ భాషలు నేర్చుకునేలా ప్రభుత్వం అవసరమైన కార్యాచరణను రూపొందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. “జపాన్, జర్మనీ వంటి దేశాల్లో ఇంజనీరింగ్ కంటే నర్సింగ్ విద్యార్థులకు అత్యధిక డిమాండ్ ఉంది. భాష ఒక్కటే అడ్డంకిగా మారిన నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులకు జపనీస్, జర్మన్ భాషలను బోధించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. త్వరలోనే నర్సింగ్ కాలేజీలకు ఆ భాషలను బోధించే ఉపాధ్యాయులను పంపిస్తాం. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సమాజంలో వైద్య వృత్తికి, వైద్యులకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అలాంటి వృత్తిలో ఉన్నవారు వ్యక్తిగతంగా కష్టనష్టాలు ఎదురైనప్పటికీ నిరుపేదలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించరాదు. నిరుపేదలకు సేవలందించడం ఒక బాధ్యతగా భావిస్తూ నర్సింగ్ వృత్తిలో రాణించి దేశ ప్రతిష్ఠను మరింత పెంచాలి. నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటాం“ అని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి మంత్రివర్గ సహచరులతో కలిసి మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో రేషన్ కార్డు లేని ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించారు. అయోధ్యలోని రామమందిరాన్ని తలపించే విధంగా భద్రాచలం రాముల వారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.



## ఇరాన్ లో ఘర్షణ

జరుగుతున్న ఘర్షణల్లో దాదాపు 16,500 మందికి పైగా ప్రజలు మరణించినట్లు తాజా నివేదిక తెలియజేసింది. అంతేకాదు.. 3,30,000 మందికిపైగా ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. డిసెంబర్ చివరి వారంలో ఇరాన్ లో ఘర్షణలు మొదలయ్యాయి. అక్కడ ఆర్థిక పరిస్తితి దిగజారడం, నిత్యావసరాల ధరలు పెరగడం, మరోవైపు తీవ్రమైన ఆంక్షలను వ్యతిరేకిస్తూ ప్రజలు నిరసనలు మొదలెట్టారు. ఈ సందర్భంగా నిరసనకారుల్ని అణచివేసేందుకు ప్రభుత్వం తీవ్ర చర్యలకు దిగింది. కాల్పులు, శిక్షలతో వేలాదిమంది ప్రాణాలు తీసింది. ఈ విషయాన్ని శనివారం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కూడా ధృవీకరించాడు. ఇరాన్లో జరుగుతున్న నిరంతరం ఘర్షణల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఖమేనీ చెప్పాడు. ఈ ఘర్షణల్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెచ్చగొట్టాడని, అతడొక క్రిమినల్ అని ఖమేనీ అన్నాడు. ఈ ఘర్షణల్లో ఎంతమంది మరణించారనేది అధికారికంగా వెల్లడికాకపోయినా.. 16,500 నుంచి 18,000 మంది వరకు మరణించి ఉంటారని, 3,30,000 మంది నుంచి 3,60,000 మంది వరకు గాయపడ్డారని అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. వీరిలో గర్భిణులు సహా మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది 30 ఏళ్లలోపు వారే. చాలా మంది ఆందోళనకారుల తలపై కాల్చడం వల్లే మరణిస్తున్నారు. అలాగే 700 నుంచి 1,000 మంది వరకు కంటి చూపు కోల్పోయారు. టెహ్రాన్ లోని ఒక కంటి ఆస్పత్రిలో ఇటీవలి కాలంలోనే 7,000 మందికిపైగా కంటి జబ్బులతో చికిత్స తీసుకున్నారు. ఆందోళనకారుల్ని అదుపు చేసేందుకు ప్రమాదకరమైన ఆయుధాల్ని వాడటం వల్ల ప్రజలు తీవ్రంగా గాయపడుతున్నారు. కళ్లు, మెడ, ఛాతి వంటి భాగాల్లో తీవ్ర గాయాలవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గాయాలపాలైన చాలా మందికిసరిపడా రక్త సరఫరా లేకపోవడం వల్ల కూడా క వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోగుల్ని కాపాడేందుకు వైద్య సిబ్బందే రక్తం దానం చేయాల్సిన పరిస్తితి ఉంది. ఇరాన్లో జరుగుతున్న ఈ మారణహోమంపై అమెరికా సహా పలు దేశాలు ఆందోళనవ్యక్తం చేస్తున్నాయి.

### విరాట్ విరోచిత
## పోరాటం వృథా

గెలిపించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు కివీస్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. డారిల్ మిచెల్ (137), గ్లెన్ ఫిలిప్స్ (106) అద్భుత శతకాలతో చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. టాప్ ఆర్డర్ విఫలమైనా, విరాట్ కోహ్లీ (124) ఒంటరి పోరాటం చేశాడు. కాగా, కోహ్లీకి వన్డేల్లో ఇది 54వ సెంచరీ. అతనికి యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి (53), హర్షిత్ రానా (52) అర్ధశతకాలతో అండగా నిలిచారు. అయినప్పటికీ, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిపాలైంది. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్, జాకరీ ఫౌల్క్స్ చెరో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

సేకరించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. 2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను సమగ్ర ప్రణాళికతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని పురాతన ప్రసిద్ధ దేవాలయాలను ఒక సర్క్యూట్ కింద ఆలయాల అభివృద్ధి, ఎకో–టూరిజం దృష్టితో నివేదిక అందించేందుకు ఒక కన్సల్టెన్సీని నియమించాలని నిర్ణయించారు. మార్చి 31 నాటికి కన్సల్టెన్సీ అందించే నివేదికపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, మేడారంలో చేపట్టిన తరహాలోనే దేవాలయాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసి, పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని మంత్రిమండలి తీర్మానించింది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి టేకోవర్ అంశంపై సమగ్రంగా చర్చించిన మంత్రిమండలి ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈలోగా మెట్రో ఫేజ్ – 2లో భాగంగా A, B విస్తరణలకు సంబంధించిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, అందుకు రూ. 2,787 కోట్లను కేటాయిస్తూ కేబినేట్ ఆమోదముద్ర వేసింది.




హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (#ICCC) నుంచి శిల్పా లే–అవుట్ వరకు సుమారు 9 కి.మీ. మేరకు కొత్త రోడ్డు నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపింది. నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో లా కాలేజీ ఏర్పాటు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.







## కుంభమేళా తరహాలో మేడారం మహాజాతర



ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే విధంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం సమ్మక్క, సారలమ్మ ఆలయాన్ని కుంభమేళాను తలపించే విధంగా, ఆదివాసీలనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకర్షించేలా తీర్చిదిద్దాం. ఇది ఒక అరుదైన సందర్భం. అద్భుతమైన సన్నివేశం. వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలని చెప్పినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. జాతర ప్రారంభమయ్యే జనవరి 28 నాటికి పూర్తి చేయాలని చెప్పాను. మేడారం ఆలయ పునరుద్ధరణ చేపట్టడం నాకు జీవితకాలం గుర్తుండిపోయే సందర్భం. జీవితకాలంలో ప్రజలకు ఏమైనా ఉపయోగపడే పని చేశామా అని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు సంతృప్తినిచ్చే ఘట్టం ఇది. జీవితాంతం గుర్తుండిపోయే అరుదైన అవకాశం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ, తెలంగాణలోగానీ హైదరాబాద్ బయట మంత్రివర్గ సమావేశం నిర్వహించిన సందర్భం లేదు. అలాంటి సమావేశాన్ని ఆదివాసీ ఆరాధ్య దైవం సమ్మక్క – సారలమ్మ పుణ్యక్షేత్రమైన మేడారంలో నిర్వహించడంపై మంత్రివర్గ సహచరులందరూ సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం గుడిని ప్రారంభించి భక్తులకు అంకితం చేస్తాం” అని ముఖ్యమంత్రి వివరించారు.

## నేడు దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి

బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు బయలుదేరనుంది. సోమవారం ఉదయం మేడారంలో పునర్నిర్మించిన సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ముఖ్యమంత్రి పూజలు నిర్వహించి మహా జాతరను ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు. ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి దావోస్‌కు బయలుదేరుతారు. ఆయనత◌ోపాటుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్‌రంజన్, సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు దావోస్ పర్యటనకు వెళ్లనున్నారు. జనవరి 20 నుంచి నాలుగు రోజుల పాటు దావోస్‌లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి ప్రముఖ కంపెనీల సీఈఓలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు. దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేల్స్‌ఫోర్స్, యూనిలీవర్, హనీవెల్, లోరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డీపీ వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి గారు విడివిడిగా భేటీ అవుతారు. అలాగే పలు రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఐటీ, ఏఐ, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరుపుతారు. తెలంగాణా రైజింగ్ 2047” విజన్‌ను, రాష్ట్రంలో వివిధ రంగాల అభివృద్ధికి ఉన్న అనుకూలతలను దావోస్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణను ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది.

## ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపు

తమకు సమర్థించని యూరప్ దేశాలపై 10 శాతం సుంకం విధిస్తామని చేసిన ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో యూరోపియన్ యూనియన్ (EU) కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జూలైలో ప్రకటించిన యూఎస్ – ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని యూరోపియన్ పీపుల్స్ పార్టీ ఉపాధ్యక్షుడు సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా వెల్లడించారు. “గత ఏడాది జూలైలో కుదిరిన యూఎస్–ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని త్వరలోనే రాటిఫై చేయాల్సి ఉంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా నుంచి ఈయూకు వచ్చే దిగుమతులపై సుంకాలను సున్నాకు తగ్గించే అవకాశం ఉండేది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాల్సి వస్తుంది” అని సిగ్‌ఫ్రిడ్ మురెసాన్ తెలిపారు. గత ఏడాది అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా లభించే ఏకైక లాభం స్థిరత్వం మాత్రమేనని పేర్కొన్నారు. కానీ ట్రంప్ తాజా ప్రకటనతో ఆ స్థిరత్వం దెబ్బతిన్నదని అన్నారు. అందుకే ఈ వాణిజ్య ఒప్పంద రాటిఫికేషన్‌ను వాయిదా వేయడం సమంజసమని స్పష్టం చేశారు.